గాలిలో దీపం రాష్ట్రంలో విద్యా వ్యవస్థ

- ఫీజులు కట్టలేక లక్షలాది మంది విద్యకు దూరం!
- రాష్ట్రంలో 16 లక్షల 75 వేల మంది విద్యార్థులు
- కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకోవడం విడ్డూరం
- తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ, తదితరులు

కాచిగూడ, నవంబర్ 30: తెలంగాణ రాష్ట్రంలో 16 లక్షల 75 వేల మంది ఫీజులు కట్టలేక అరిగోస పడుతూ, విద్యకు దూరమవుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. కాచిగూడలో శనివారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా వ్యవస్థ 'గాలిలో దీపం'గా ఉందని ఆరోపించారు. రూ.4 వేల కోట్ల ఫీజుల బకాయిలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని తెలంగాణ వ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయలను ముట్టడించినా ప్రభుత్వానికి తున్నపోతు మీద వర్షం పడ్డట్లుగా ఉందని ధ్వజమెత్తారు. సీఎం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, స్కాలర్‌షిప్‌లను రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ కాదు.. విద్యార్థుల భవిష్యత్తును సుందరీకరణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు.

చెరువు ఎట్లుంటదో చేసి చూపెడతాం

ఆక్రమణలకు పాల్పడితే ఏ ఒక్కరినీ వదలం..

- హైడ్రా అంటే.. కూల్చడం కాదు.. చెరువుల పునరుద్ధరణ
- బయోడైవర్సిటీ సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడంలో పేదవారి కంటే ధనవంతులు, సంపన్నులే ఎక్కువ మంది ఉన్నారని, అన్ని రాజకీయ పార్టీల నుంచి కూడా ఆక్రమణలలో ఉన్నారని, ఆక్రమణలకు పాల్పడితే ఏ ఒక్కరినీ వదలబోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. హైడ్రా చేసే ప్రతి పనికి ప్రభుత్వ మద్దతు ఉంటుందని, చెరువు అసలు ఎంత ఉంటుందని, చెరువుతో పర్యావరణం ఎలా మెరుగుపడుతుందో చేసి చూపిస్తామని రంగనాథ్ అన్నారు. బేగంపేటలోని తాజ్ వివాంత హోటల్‌లో శనివారం జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్మెంటల్ ఇనీషియేషన్ ఆధ్వర్యంలో 'అర్బన్ బయోడైవర్సిటీ' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, చెరువుల పరిరక్షణ, వాటి పునరుద్ధరణ, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలు, పార్కులు, రహదారులు, నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చూడటం హైడ్రా ప్రధాన బాధ్యత అన్నారు. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలను పరిరక్షించడంతో పాటు వారి ఆస్తులను పరిరక్షించడం కూడా తమ విధి విధానాల్లో ఒకటిని చెప్పారు. ప్రభుత్వ స్థలాలతో పాటు చెరువులు ఆక్రమణల పాలవకుండా అనేక చట్టాలున్నాయని, అవన్నీ ఖచ్చితంగా అమలయ్యేలా హైడ్రా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జూబ్లీహిల్స్‌లోని లోటస్ పాండ్‌లో ఏకంగా ఎకరం స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తిని హైడ్రా అడ్డుకుందని గుర్తుచేశారు. నగరంలో చెరువులు 61శాతం కబ్జాకు గురయ్యాయని, 39 శాతం చెరువులు వచ్చే 15 ఏండ్లలో కనుమరుగయ్యే ప్రమాదముందని, వీటి పరిరక్షణపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని ఆయన కోరారు. ఈ క్రమంలోనే ఎన్ఆర్ఎస్ఏ, సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తదితర ప్రభుత్వ విభాగాలన్నింటి సహకారంతో చెరువుల లెక్కతో పాటు వాటి విస్తీర్ణం ఎంతో తేల్చి డేటా తయారు చేస్తున్నామని రంగనాథ్ చెప్పారు. హైడ్రా అంటే కూల్చడం కాదని, చెరువులను పునరుద్ధరించి, అక్కడ చక్కటి వాతావరణం ఏర్పాటు చేసి మెరుగైన ప్రజాజీవనం కల్పించడం అన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు నిర్ధారణ చేసి అక్కడ నిర్మాణాలు చేపట్టరాదని, ఒకవేళ చేపడ్తే వాటిని కూల్చివేయొచ్చని కోర్టులు ఎంతో స్పష్టంగా చెప్పాయన్నారు. చెరువులు కబ్జాకు గురవకుండా చూడటమే కాకుండా చెరువులను కాలుష్యంతో నిండిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని, పారిశ్రామిక వ్యర్థాలన్నీ చెరువులోకి రాకుండా చూస్తామని, ఇందుకు హైడ్రా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇరు శాఖలు కలిసి పనిచేస్తాయన్నారు.



సదస్సులో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

హైడ్రాకు నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ సహకారం

చెరువుల పరిరక్షణలో భాగంగా జరిగిన సదస్సులో హైడ్రా చర్యలను నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ వైర్మన్ సి.అచలేందర్ రెడ్డి అభినందించారు. జీవ వైవిధ్యానికి ఊతమిచ్చే చెరువుల పరిరక్షణలో హైడ్రాకు నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ పూర్తి సహకారం ఉంటుందని ఆయన చెప్పారు. ప్రతి నగరంలో హైడ్రా వంటి వ్యవస్థ ఉండాలని సిఫారసు చేస్తామన్నారు. హెరిటేజ్ చెరువుగా పేరొందిన అమీన్‌పూర్ చెరువును మంచినీటి సరస్సుగా మార్చడానికి తమ వంతు సహకారం అందిస్తామని అచలేందర్‌రెడ్డి చెప్పారు.

పొరుగు సంస్థకు యూనివర్సిటీ స్థలం.. దారుణం!

నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన

ఆందోళన చేస్తున్న అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్, నవంబర్ 30: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో మరింత మెరుగైన విద్యను అందించడంతో పాటు కొత్త కోర్సులను ప్రవేశపెట్టే క్రమంలో యూనివర్సిటీ స్థలాన్ని వేరే సంస్థలకు అప్పగించాలని చూడటం దారుణం అని వర్సిటీ ఉద్యోగుల జేఏసీ చైర్ పర్సన్ ప్రొ. పల్లవీ కాబ్డే అన్నారు. యూనివర్సిటీ శిక్షణ కేంద్రాలు, ప్రయోగశాలల ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తుంటే ఉన్న స్థలాన్ని ఇతర సంస్థలకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అవివేకమని వర్సిటీ ఉద్యోగుల జేఏసీ పేర్కొన్నది. యూనివర్సిటీకి చెందిన పదెకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్‌యూకు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రొ. పల్లవీ కాబ్డే మాట్లాడుతూ, అంబేద్కర్ యూనివర్సిటీ ఇటీవల న్యాక్– ఏ గ్రేడ్‌ను సాధించిందని, దీని వల్ల యూజీసీ నుంచి నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నిధులతో యూనివర్సిటీలో అంతర్జాతీయ స్థాయి శిక్షణ కేంద్రాలు, కంప్యూటర్ ల్యాబ్స్ తదితర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందని, అయితే యూనివర్సిటీ స్థలాన్ని వేరే సంస్థలకు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఈ ప్రాజెక్టులు మొత్తం మూలన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే దాకా.., తమ ఆందోళన కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, డా. మక్దూమ్ మొహియుద్దీన్, మాలోత్ బుద్ధ పాల్గొన్నారు.

ప్రజల పక్షపాతి జర్నలిస్టు విద్యాభూషణ్

విద్యాభూషణ్ సంతాప సభలో పలువురు వక్తలు

విద్యాభూషణ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్, సతీశ్ చందర్, సీనియర్ జర్నలిస్టు జూలూరు గౌరి శంకర్ తదితరులు

చిక్కడపల్లి, నవంబర్ 30: ప్రజల పక్షపాతి రచయిత, జర్నలిస్టు విద్యాభూషణ్ ఆదర్శనీయుడని పలువురు వక్తలు అన్నారు. విప్లవ పార్టీలు, బంధు మిత్రుల ఆధ్వర్యంలో విద్యాభూషణ్ సంతాప సభను శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి జి.ఝాన్సీ అధ్యక్షతన సంతాప సభను నిర్వహించారు. సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్, సతీశ్ చందర్, సీనియర్ జర్నలిస్టు జూలూరు గౌరీ శంకర్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణు గోపాల్, న్యూ డెమోక్రసీ సీనియర్ నాయకుడు కె.గోవర్ధన్‌లు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.హన్మేశ్, విద్యా భూషణ్ కుమారుడు ఆజాద్, కూతురు సంధ్య తదితరులు హాజరై విద్యాభూషణ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్ మాట్లాడుతూ, విద్యా భూషణ్ అసాధారణమైన జర్నలిస్టు, గొప్ప ఆలోచనలు కలవారని అన్నారు. సతీష్ చందర్ మాట్లాడుతూ, విద్యాభూషణ్ ఆదిలో విప్లవ రాజకీయాలతో ప్రారంభమై వృత్తి మారినా రాజకీయాలు వదల లేదన్నారు. జీవితమంతా ఆదర్శనీయంగా కొనసాగిందన్నారు. సీనియర్ జర్నలిస్టు జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ, విద్యాభూషణ్ ప్రపంచీకరణకు వ్యతిరేకంగా సమాజాన్ని జాగృతం చేసేవాడని అన్నారు. నేటి తరానికి భూషణ్ ఆదర్శ ప్రాయుడని, ఆయన పేరుపై స్మారక ట్రస్ట్ ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ సభలో ఎస్.ఎల్. పద్మ, ప్రదీప్, అనూరాధ, అరుణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నా సర్వీసులో మీలాంటి అధికారిని చూడలేదు

డీసీ శంభు ప్రసాద్ పదవీ విరమణలో ఈడీ కమలాసన్‌రెడ్డి

సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా 42 సంవత్సరాల పాటు సేవలందిస్తున్న అధికారిని నా సర్వీసులో మొదటిసారి చూస్తున్నానని, గతంలో ఎన్నడూ చూడలేదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి, కంప్యూటర్స్ విభాగం డిప్యూటీ కమిషనర్ శంభు ప్రసాద్‌ను ప్రశంసించారు. అబ్కారీ శాఖలోని కంప్యూటర్స్ విభాగంలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ శనివారం పదవీ విరమణ చేసిన శంభు ప్రసాద్, ఆయన సతీమణి భాగ్యలక్ష్మి దంపతులను అబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి శనివారం ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ, 14 సంవత్సరాల పాటు పోస్టల్ ఉద్యోగిగా విధులు నిర్వర్తించడం, ఆ తరువాత అబ్కారీ శాఖలో బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరో పక్క ఖగోళ శాస్త్రవేత్తగా పరిశోధనలు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. పదవీ విరమణ అనంతరం, ఖగోళ శాస్త్రంలో మరిన్ని పరిశోధనలు జరిపి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. శంభుప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగంలో ఎన్నో కష్టాలు, నష్టాలు వచ్చినా భయపడకుండా పనిచేయడం వల్లనే తనకు ఈ రోజు మంచి పేరు వచ్చిందన్నారు. తన శేష జీవితాన్ని పరిశోధనలకు వినియోగిస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఏ.అజయ్ రావు, జాయింట్ కమిషనర్ ఖురేషి, కేఏబీ శాస్త్రి, సురేశ్, బేవరీస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహం, జాయింట్ డైరెక్టర్ శశిధర్, డీసీలు దశరథ్, రఘురాం పాల్గొన్నారు.

డిసెంబర్ 2 నుంచి ఇగ్నో పరీక్షలు

ఆబిడ్స్. నవంబర్ 30: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) డిసెంబర్ 2వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు తెలంగాణలోని ఏడు పరీక్షా కేంద్రాలలో 2024 విద్యా సంవత్సరానికి గాను పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ కేంద్రం సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ శనివారం తెలిపారు. హాల్ టికెట్లను ఇగ్నో వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నం. 94924 51814, 040 – 2311 7550 లలో సంప్రదించాలని సూచించారు.

రాజీ మార్గమే రాజ మార్గం: రేణుక

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): రాజీ మార్గమే రాజ మార్గమని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ రేణుక యార అన్నారు. మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, సివిల్, ఇతర కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 14న నిర్వహిస్తామని పేర్కొన్నారు. సిటీ సివిల్ కోర్టులోని తన చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి కక్షిదారుడు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది మార్చి, జూన్, సెప్టెంబర్ మాసాలకు సంబంధించిన యాక్సిడెంట్, సివిల్ కేసులు అలాగే, ఇతర కేసులు 1643 పరిష్కరించి సంబంధిత కక్షిదారులకు వంద కోట్లకు పైగా నష్ట పరిహారం అందించడం జరిగిందన్నారు. అదే విధంగా బ్యాంక్ కేసులు 8207కు గాను రూ.21 కోట్ల 47 లక్షలకు పైగా కక్షిదారులకు లబ్ధి చేకూర్చామని వెల్లడించారు.

బాధ్యతాయుత జర్నలిజంతో నవ శకానికి నాంది

ఎంసీఆర్ హెచ్ఆర్డీ డీజీ శంశాంక్ గోయల్ వెల్లడి

గయానా మీడియా ప్రతినిధులకు శిక్షణ పూర్తి

హైదరాబాద్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): బాధ్యత, నైతికత, ప్రభావంతమైన జర్నలిజం నవ శకానికి నాంది పలుకుతుందని ఎంసీఆర్ హెచ్ఆర్డీ డైరెక్టర్ జనరల్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శంశాంక్ గోయల్ తెలిపారు. గయానా మీడియా ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన రెండు వారాల శిక్షణ తరగతుల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులు గయానాలోని మీడియా రంగానికి ఉపయోగపడుతాయని చెప్పారు. శిక్షణ పొందిన గయానా మీడియా ప్రతినిధులకు కోర్సు కంప్లీషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

జల మండలి టెక్నికల్ డైరెక్టర్ పదవీ విరమణ

సిటీబ్యూరో, నవంబరు 30(నమస్తే తెలంగాణ): జల మండలి టెక్నికల్ డైరెక్టర్ పి. రవి కుమార్ పదవీ విరమణ పొందారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో రవి కుమార్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. సంస్థ ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్‌లు పాల్గొని రవి కుమార్‌కు సన్మానం చేశారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది సాధారణమని, పనిని ప్రేమించే వారికి మాత్రం అది కష్టమైన పని అని ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. రవి కుమార్ నాలుగున్నరేళ్లుగా టెక్నికల్‌గా, ప్రాజెక్ట్ విభాగాలకు డైరెక్టర్‌గా పనిచేశారన్నారు. అనంతరం, జల మండలి ఇంజనీర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో రవి కుమార్‌కు సన్మానం చేశారు. ఉద్యోగులు, సిబ్బంది ఆయనతో ఉన్న జ్ఞాపకాల్ని నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్–1, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా బైక్ ర్యాలీ

సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): రైల్వే కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ పనిచేస్తున్నదని సీ అండ్ డబ్ల్యూ మెకానిక్ బ్రాంచ్ అధ్యక్షుడు రాధారి రామ్మోహన్ ముదిరాజ్ అన్నారు. డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో రైల్వే కార్మికుల గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రైల్వే వాషింగ్ సైడింగ్ వరకు శనివారం బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ, ఏ రాజకీయ పార్టీకి అనుబంధం లేకుండా కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక యూనియన్ సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ అని చెప్పారు. కార్యక్రమంలో ట్రెజరర్ ఖలీల్ రెహమాన్, ఆఫీస్ బేరర్స్ శ్యామ్, అర్జున్, సునీల్, రాజేష్, ప్రవీణ్, సరిత పాల్గొన్నారు.

రేవంత్ విష కౌగిలి నుంచి మాలలను రక్షించుకోవాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ వీఎల్ రాజు

సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

రవీంద్రభారతి,నవంబర్ 30: వర్గీకరణ, క్రిమిలేయర్ అనుకూల సుప్రీం కోర్టు తీర్పులపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డా. వీఎల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విష కౌగలి నుంచి మాలలను రక్షించుకోవాలని ఆయన పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాల మహానాడు ఆధ్వర్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన దళిత బహుజన జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వూరూప్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వర్గీకరణపై ఏఐసీసీ నేతలు ఎలాంటి నిర్ణయం తీసుకోక ముందే వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌ను నియమించడం మాలలకు తీరని ద్రోహం చేశారన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మాలలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి రేవంత్‌రెడ్డిని సీఎం చేశారని, వర్గీకరణ పేరుతో సీఎం మాలలకు వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. మాల, మాదిగలను విడదీయడానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజ నర్సింహ, ఎమ్మెల్యే వివేక్‌తో కలిసి మోసం చేస్తున్నారని విమర్శించారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగేది మాలల సింహాగర్జన కాదని, కాంగ్రెస్ సభ అని, వివేక్ వెంకటస్వామి మంత్రి పదవి కోసమే ఈ సభను నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. మాలట ప్రజాప్రతినిధులు ఏకసభ్య కమిషన్‌పైన అసెంబ్లీలో చర్చించి, సీఎంను నిలదీయాలని సూచించారు. వర్గీకరణకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు వ్యతిరేకంగా డిసెంబర్ 7 నుంచి జనవరి 26వ తేదీ వరకు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సదస్సులో పబ్బతి శ్రీకృష్ణ, న్యాయవాది వెంకట్రావ్, జేఎన్‌రావు, గవ్వల శ్రీకాంత్, దేవేందర్, రోజులీలా పాల్గొన్నారు.

కారు ఢీకొని చిన్నారి మృతి

చిన్నారి ఆద్య (ఫైల్)

చర్లపల్లి, నవంబర్ 30: ప్రమాదవశాత్తు కారు ఢీకొని చిన్నారి మృతి చెందిన ఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, సూర్యాపేట జిల్లా అత్మకూర్ మండలం నెమ్మికల్ గ్రామానికి చెందిన రమేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధి కోసం నగరానికి వచ్చి మేడిపల్లిలో ఉంటున్నాడు. కాగా, రమేశ్ కుటుంబ సభ్యులతో కలిసి చర్లపల్లిలోని బంధువుల వివాహ వేడుకలకు రావడంతో అతని కూతురు బంటు ఆద్య(9) బంధువుల ఇంటి ముందు ఆడుకుంటుంది. అయితే, వివాహ వేడుకలకు వచ్చిన బంధువు కారును రివర్స్ తీసే క్రమంలో పాపను ఢీకొట్టింది. దీంతో చిన్నారికి తీవ్రగాయాలైయ్యాయి. వెంటనే బంధువులు గమనించి ఆద్యను మెరుగైన చికిత్స కోసం ఈసీఐఎల్ చౌరస్తాలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. వెంటనే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల హామీలను అమలు చేయాలి

డీఎస్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్

అభివాదం చేస్తున్న డీఎస్‌డీ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, నాయకులు

చిక్కడపల్లి, నవంబర్ 30: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగుల కోసం ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్(డీఎస్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎస్‌డీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయాలని ధర్నా నిర్వహించారు. వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి.భారతిలు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చినా ఏ ఒక్క హామీ కూడా అమలు చేయాలేదని మండిపడ్డారు. ప్రభుత్వం దివ్యాంగులకు సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. దివ్యాంగులు నేడు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా.., ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా హామీలు ఒక్కటి కూడా అమలు చేయక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు స్పందించి తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. చేయూత పథకం దివ్యాంగులు పెంచనున్న రూ.4016 నుంచి రూ.6000లకు పెంచి వెంటనే పంపిణీ చేయాలని, రాష్ట్ర అంతట దివ్యాంగులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పించాలని, దివ్యాంగులకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీఎస్‌డీ వైస్ ప్రెసిడెంట్ కే.వెంకటేశ్ గౌడ్, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్, టీఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మమద్ మున్నా, వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాల్, వైస్ చైర్మన్ అందె రాంబాబు, అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య, గౌని యాదగిరి, మహేశ్, మెరుగు శివ పాల్గొని ధర్నాకు మద్దతు తెలిపారు.

కొండకల్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిస్తాం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, నవంబర్ 30(నమస్తేతెలంగాణ): శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామంలో గిరిజనుల భూముల వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు జరిపించి నివేదికను ఎస్టీ కమిషన్‌ను అందజేస్తామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో కొండకల్ గ్రామానికి చెందిన రైతులతో ఆయన విడివిడిగా చర్చలు జరిపారు. కొండకల్ గ్రామంలోని సర్వే నంబర్ –352, 362, 363, 364, 377లోని భూములు రక్షిత కౌలుదారుల ఆధీనంలో ఉన్నాయని, ఎన్నో ఏండ్లుగా ఈ భూములను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామంలో పెద్ద మనిషిగా చలామణి అవుతూ.. గిరిజనులను భయపెట్టి, అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడని, ఈ విషయాన్ని అడగటానికి వెళ్లిన గిరిజనులపై కేసులు పెట్టిస్తున్నారని, జాతీయ ఎస్టీ కమిషన్‌కు గిరిజనులు, లంబాడీ హక్కుల పోరాట సమితిలు రైతులతో కలిసి జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్టీ కమిషన్ సమగ్ర విచారణ జరిపి తమకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే, గిరిజనుల భూములు కొనుగోలు చేసిన అపర్ణ సంస్థపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుల ఆదేశాల మేరకు విచారణ జరిపిన కలెక్టర్ కొండకల్ గ్రామంలో ఎలాంటి ఆంద